క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

యద్దనపూడి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నేడు ఎంపీపీ పులగం రజనీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ షేక్ మహ్మద్ అఖీబ్ జావెద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి జరిగే సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

నేడు పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ

జే.పంగులూరు: 2025–26కు సంబంధించి జీపీడీపీ, బీపీడీపీ ప్రిపరేషన్‌లో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో నేడు ఓరియంటేషన్ ట్రైనింగ్ జరగనున్నట్లు ఎంపీడీఓ కే స్వరూపారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు శిక్షణ కార్యక్రమానికి తప్పక హాజరు కావాలని తెలిపారు.

లైవ్ సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లో పొందుపరచాలి

ఇంకొల్లు (చినగంజాం): రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్‌లు లైఫ్ సర్టిఫికెట్లను 2025 జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఆన్‌లైన్ ద్వారా సబ్‌మిట్ చేయాలని పెన్షనర్‌ల బాపట్ల జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు రావుల బాపయ్య, కరి కమలేశ్వరరావులు ఒక ప్రకటనలో తెలిపారు. డైరక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్ ప్రకటించిన విధంగా లైఫ్ సర్టిఫికెట్ సబ్మిట్ చేసుకోవాలన్నారు. నవంబరు, డిసెంబరు నెలల్లో సబ్‌మిట్ చేస్తే అవి చెల్లుబాటు కావని వారు పేర్కొన్నారు.

పచ్చనేత.. డబ్బు మేత !

- పంచాయతీ ఆదాయం పచ్చనేత పరం
- కూరగాయలు, మాంసం మార్కెట్ చిట్టీల వసూళ్లకు వేలం జరపని వైనం
- మార్కెట్‌లో చిట్టీల నగదు వసూలు
- నెలకు దాదాపు రూ. 40 వేల వరకు వసూళ్ల పర్వం
- వ్యవహారంలో పంచాయతీ అధికారుల మిలాకత్



డ్రైనేజీ కరకట్టపై మార్కెట్ కోసం వేసిన రేకులు షెడ్డులు

వేటపాలెం: అధికారం మాదే.. ఎవరు అడ్డొస్తారో చూస్తాం.. ఇదీ తెలుగుదేశం పార్టీ నాయకుల దురాగతం. వీరి నాయకుడు సీఎం చంద్రబాబునాయుడు మాత్రం క్రమశిక్షణ పార్టీ మాది.. నీతి, నిజాయతీ గల పార్టీ మాది అని బాకాలు ఊదుతుంటాడు. నోరు తెరిస్తే పచ్చి అబద్ధాలు, అసత్య ప్రచారం చేయడటంలో చంద్రబాబు అందెవేసిన చేయి. యథారాజ తథా ప్రజ అన్న చందంగా తయారైంది ప్రస్తుత కూటమి ప్రభుత్వం. వేటపాలెం మండలంలో గ్రామ పంచాయతీల ఆదాయం పచ్చనేత పాలవుతోంది. ఈ వ్యవహారంలో సంబంధిత అధికారులకు తెలిసి మిన్నకుండిపోతున్నారు. ఉన్నత అధికారులు పంటించుకున్న దాఖలాలు లేవు. గ్రామ పంచాయతీల పరిధిలో ఉండే కూరగాయలు, చేపలు, మాంసం మార్కెట్‌లో దుకాణాలకు సంబంధించి ప్రతి ఏడాది మార్చిలో చిట్టీలు వసూలు చేసుకొనేందుకు వేలం పాటలు నిర్వహిస్తుంటారు. వేలంలో ఎక్కువ మొత్తం పాడిన వారికి మార్కెట్‌లో వ్యాపారుల నుంచి రోజువారి చిట్టీల వసూలుకు అనుమతి ఇస్తారు. కాంట్రాక్టర్ గ్రామ పంచాయతీకి పాట పాడిన మొత్తం, మూడు విడతల్లో చెల్లిస్తారు. ఇది వాస్తవంగా ప్రతి ఏడాది జరిగే సాధారణ కార్యక్రమం.

పక్కదారి పడుతున్న ఆదాయం..

రామన్నపేట పంచాయతీల పరిధిలో ఉన్న కూరగాయలు, చేపల మార్కెట్‌లకు ఈ ఏడాది చిట్టీలు వసూలు చేసుకునేందుకు వేలం నిర్వహించ లేదు. వేలం నిర్వహించని పక్షంలో పంచాయతీ సిబ్బంది చేత మార్కెట్ దుకాణాలు నిర్వాహకుల నుంచి రోజువారి చిట్టీలు వసూలు చేయాల్సి ఉంది. రామన్నపేట పంచాయతీ పరిధిలోని కూరగాయలు, చేపలు, మాంసం మార్కెట్‌లో చిట్టీల వసూలు బాధ్యత పచ్చనేతల చేతికిచ్చారు. వీరు ప్రతి రోజూ ఉదయం, సాయంకాలం మార్కెట్‌లో దుకాణాదారుల నుంచి కూరగాయల విక్రయానికి రూ.20, చేపలు విక్రయానికి రూ. 30 మాంసం విక్రయానికి రూ. 40 చొప్పున నగదు వసూలు చేసుకుంటున్నారు. దీనితో పాటు గ్రామంలో ఎవరైన తోపుడు బండ్లు, కూరగాల విక్రయించిన వారి నుంచి కూడా చిట్టీల రూపంలో నగదు వసూలు చేస్తుంటారు. ఈ విధంగా రోజుకూ రూ. 1500 నుంచి రూ. 2 వేల వరకు నగదు వసూలు చేకుంటున్నారు. ఈ వసూలు చేసిన నగదు గ్రామ పంచాయతీకి జమ చేసిన దాఖలాలు లేవు. పంచాయతీకి రావాల్సిన ఆదాయాన్ని పచ్చనేతల అనుచరులు రూ.లక్షల్లో స్వాహా చేస్తున్నారు.

డ్రైనేజీ కరకట్టపై మార్కెట్ షెడ్డుల నిర్మాణం..

రామన్నపేట పంచాయతీ పరిధి నుంచి వెళ్తున్న స్ట్రయిట్ కట్ డ్రైనేజీ కరకట్టను అక్రమించి రూ.3 లక్షల వ్యయంతో కూరగాయలు, చేపలు, మాంసం విక్రయాల కోసం షెడ్లు ఏర్పాటు చేశారు. కంచె చేను మేస్తే.. అనే సామెతలా తయారైంది పంచాయతీ అధికారుల పరిస్థితి. ఒక వైపు డ్రైనేజీ కరకట్టలు అక్రమంచి ప్రైవేటు వ్యక్తులు ఇళ్ల నిర్మించుకుంటున్నారు. మరో పక్కన కరకట్టల నుంచి అక్రమంగా ఇసుక తరలించుకొనిపోతున్నారు. ఇప్పుడు ఏకంగా పంచాయతీ అధికారులే డ్రైనేజీ కరకట్టను ఆక్రమంచి మార్కెట్ వినియోగం కోసం రేకుల షెడ్లు వేశారు. అయితే మార్కెట్ ద్వారా పంచాయతీకి వచ్చిన ఆదాయం సున్నా. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వేటపాలెం, రామన్నపేట గ్రామ పంచాయతీల పరిధిలోని మార్కెట్‌లకు వేలం నిర్వహించకుండా ప్రైవేటు వ్యక్తుల పరం చేయడంపై విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు.

> **మార్కెట్ వేలం పాటలు జరపలేదు..**
>
> మార్కెట్ వేలం పాటలు జరపలేదు. పంచాయతీ సిబ్బంది మార్కెట్‌లో చిట్టీల నగదు వసూలు చేయడం లేదు. ప్రైవేటు వ్యక్తులు వసూలు చేసి కొంతకడుతున్నారు. డ్రైనేజీ కాలవ కట్టపై తాత్కాలికంగా మార్కెట్‌లో విక్రయాలు జరుపుకొనే వారి కోసం రూ. 3 లక్షలతో నిదులతో రేకులు షెడ్లు ఏర్పాటు చేశాం. ఈ నిధులు 15 పంచవర్ష ప్రణాళిక నుంచి ఖర్చు చేస్తున్నాం.
>
> – సురేంద్ర, కార్యదర్శి, రామన్నపేట

క్యాన్సర్ స్క్రీనింగ్‌తో ఉపయోగాలు



క్యాన్సర్ స్క్రీనింగ్ చేస్తున్న వైద్య సిబ్బంది

కారంచేడు: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎన్‌సీడీ సీడీ యాప్ ద్వార 3.0 క్యాన్సర్ స్క్రీనింగ్ చేస్తున్న తమ సిబ్బందికి ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని స్వర్ణ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ఎం శాలినీ సూచించారు. శుక్రవారం ఆమె మండలంలోని కొడవలివారిపాలెం గ్రామంలో నిర్వహిస్తున్న క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రతి గ్రామంలోని ఇంటింటికీ వచ్చి సర్వే చేస్తారన్నారు. 18 ఏళ్ల నిండిన ప్రతి మహిళకు ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ వీ నాగేశ్వరరావు, హెచ్ఈ మీనాకుమారి, హెచ్‌వీ మాధురీసిఫోరా, శారథ, అరుణ, వైద్య సిబ్బంది, ఆశలు పాల్గొన్నారు.

పుస్తక పఠనం విద్యార్థులకు ఎంతో ముఖ్యం



చినగంజాంలో మాట్లాడుతున్న అతిథులు



చీరాలలో పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

చినగంజాం: పుస్తక పఠనం విద్యార్థులకు ఎంతో ముఖ్యమైనదని జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు సుద్దపల్లి నరసింహారావు అన్నారు. శుక్రవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రంథాలయంలో లైబ్రేరియన్ మోహన లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని నరసింహరావు ప్రారంభించి పుస్తక పఠనం వలన కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గుత్తి శారద, వై రామాంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చీరాల అర్బన్: పుస్తకాలు, పుస్తక కేంద్రాలు ప్రజా చైతన్యానికి దీపికలాంటివని, పుస్తకాలు చదవడం అంటే గత చరిత్రను గుర్తుంచుకోవడమేనని కోటక్ మహీంద్ర బ్యాంకు మేనేజర్ టి.తిరుపతిరెడ్డి అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జరిగిన పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. పుస్తక పఠనం అనేది మంచి వ్యసనమన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ డి.ధనమ్మ, చుండూరి కృష్ణమూర్తి, ఆర్.రూపాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్య స్థాపనకు గాంధీజీ కృషి



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీవో కుసుమ కుమారి

బల్లికురవ: గ్రామ స్వరాజ్య స్థాపనకు గాంధీజీ ఎనలేని కృషి చేశారని ఎంపీడీవో కుసుమ కుమారి కొనియాడారు. శుక్రవారం స్థానిక పరిషత్ కార్యాలయంలో రెండు బ్యాచ్‌లుగా 21 పంచాయతీలోని సర్పంచ్‌లు, సెక్రటరీలు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌లు, మండల స్థాయి అధికారులతో అభివృద్ధి ప్రణాళికల్లో శిక్షణ సమావేశం నిర్వహించారు. 2025–26 సంవత్సరానికి గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సర్పంచ్‌లు సెక్రటరీలు ఆయా గ్రామాల్లో చేపట్టాల్సిన పనులకు సంబంధించి ప్రణాళికలతో పాటు అంచనాలు తయారు చేసుకోవాలన్నారు. శిక్షణలో భాగంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ, ఈవోఆర్డీ దాసరి సుమతి, అధికారులు పాల్గొన్నారు.



కారంచేడు పెదబజారు శివాలయంలో భక్తుల ప్రత్యేక పూజలు



వాడరేవు సముద్రతీరంలో పౌర్ణమి స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



మేదరమెట్లలో దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు




బల్లికురవ: బ్రహ్మగుండంలో స్నానాలు చేస్తున్న భక్తులు



చీరాలలోని వీరరాఘవస్వామి దేవాలయంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి

- తెల్లవారుజాము నుంచే కార్తీక పూజలు
- భక్తులతో కిక్కిరిసిన సముద్ర తీరం



గన్నవరంలో విశేష అలంకరణలో కాశీవిశ్వేశ్వరుడు



తిమిడెదపాడులో ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

కారంచేడు/చినగంజాం/మార్టూరు/యద్దనపూడి: కార్తీక పౌర్ణమి వేళ శైవక్షేత్రాలన్ని దేదీప్యమానంగా దీపాలతో వెలుగొందుతున్నాయి. పండితుల మంత్రోచ్ఛరణలు, భక్తజనుల కోలాహలం, దీపకాంతుల మధ్య ఆలయాలన్ని శోభాయమానంగా కనిపించాయి. వేకువజామునే మహిళలు ఆలయాల వద్ద కార్తీక జ్యోతులు వెలిగించారు. చీరాల వాడరేవు, రామాపురం, వేటపాలెం మండలంలోని సముద్ర తీరాల్లో భక్తులు పోటెత్తారు. కార్తీక పౌర్ణమి రోజున నదీ, సముద్ర స్నానం చేయడం వలన విశేష పుణ్య ఫలితాలు లభిస్తాయని కార్తీక పురాణంలో చెప్తోంది. దాంతో మండలంలోని వివిధ గ్రామాల భక్తులు తెల్లవారు జామునే లేచి నదీ, కాలువ, సముద్ర స్నానాలు చేశారు. యద్దనపూడి మండలంలోని పూనూరులో త్రిపురాంతకస్వామి, గన్నవరం కాశీ విశ్వేశ్వరస్వామి, యద్దనపూడి రామలింగేశ్వరస్వామి, ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా కార్తీక పౌర్ణమి ప్రత్యేక పూజలు..

■ కారంచేడు పెదబజారు శివాలయం, వైష్ణవీదుర్గామాత ఆలయం, హరేరామ విశిష్ట ఆశ్రమం, వెంకటేశ్వరస్వామి గుడి, తిమిడెదపాడు గంగమ్మగుడి, స్వర్ణ శివాలయంలలో భక్తులు వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. కారంచేడు కాలువ సెంటర్‌లోని కొమ్మమూరు కాలువలో భక్తులు పెద్ద ఎత్తున తలంటు స్నానాలు ఆచరించారు.

■ చినగంజాం మండలంలోని మోటుపల్లి, పల్లెపాలెం, పెదగంజాం పల్లెపాలెం సముద్రతీరంలో భక్తులు సముద్ర స్నానాలు ఆచరించారు. భక్తులు వందల సంఖ్యలో శుక్రవారం వేకువ జామునుంచే స్నానాలు ఆచరించేందుకు తండోప తండాలుగా తరలి వెళ్లారు. చినగంజాం మండలంలోని గ్రామాలతో పాటు చుట్టుపక్కల మండలాల నుంచి భక్తులు సముద్ర స్నానాలకు తరలి వచ్చారు. తీరం వెంబడి ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ శీలం రమేష్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసారు. సివిల్ పోలీసులు, హోంగార్డులు, మహిళా పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు.

పుణ్యస్నానంతో శివుడి కృప..

అద్దంకి/జే.పంగులూరు/బల్లికురవ/మేదరమెట్ల: కార్తీక మాసంలో అత్యంత పుణ్య ఫలాన్నిచ్చేదిగా శాస్త్రాల్లో చెప్పబడిన కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని భక్తులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. దానిలో భాగంగా స్వయంభు లింగ క్షేత్రంగా దక్షిణ కాశిగా పేరుగాంచిన మండలంలోని మణికేశ్వరం దేవాలయం భక్తులతో కిలకిటలాడింది. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. గుండ్లకమ్మ నది ఘాట్‌లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. తరువాత దేవాలయం ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు. అదే విధంగా పట్టణంలోని రామలింగేశ్వరం, కమతేశ్వర, నగరేశ్వర స్వామి ఆలయంలో దీపాలు పెట్టారు.

■ మేదరమెట్ల గ్రామంలోగల పార్వతీ సమేత మల్లీశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో తెల్లవారుజాము నుంచే మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై దీపాలను వెలిగించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి వేళలో కూడా దేవస్థానానికి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని దేవాలయం చుట్టూ దీపాలను వెలిగించి పూజలు నిర్వహించారు.

బ్రహ్మగుండానికి పోటెత్తిన భక్తులు..

కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి కొణిదెన సమీపంలోని ఎంతో చరిత్ర కలిగిన బ్రహ్మగుండంలో స్నానాలు చేసేందుకు భక్తులు పోటెత్తారు. బాపట్ల జిల్లాతోపాటు ఒంగోలు, పల్నాడు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్నానాలు చేసిన తదుపరి అక్కడే ఉన్న మర్రిచెట్టు సమీపంలో వత్తులు వెలిగించారు. గంగ పార్వతీదేవి సహిత నాగలింగేశ్వరుడికి జరిగిన అభిషేకాల్లో పాల్గొన్నారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపట్టారు. బల్లికురవ ఎస్సై జీవీ చౌదరి సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

సముద్ర తీరనా కార్తీక పౌర్ణమి శోభ..

వేటపాలెం: కార్తీక మాసంలో పౌర్ణమి రోజుల సూర్యోదయానికి ముందు వేకు జామునే సముద్రంలో స్నానాలు ఆచరిస్తే పుణ్యం దక్కుతుందని భక్తులకు విశ్వాసం. తీర ప్రాంతాలైన పొట్టిసుబ్బయ్యపాలెం, కఠారివారిపాలెం, రామచంద్రాపురం, రామాపురం సముద్ర తీరాల్లో భక్తులు అదిక సంఖ్యలో పుణ్యస్నానాలు ఆచరించారు. తీరం వద్ద పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకోన్నారు. స్నానాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఎస్సై ఎం వెంకటేశ్వర్లు పటిష్ట పోలీస బందోబస్తు ఏర్పాటు చేశారు. గజఈత గాళ్లను సముద్రతీర వద్ద ఉంచారు.

చీరాల అర్బన్: చీరాల, పేరాలలలోని శివాలయాలు, మదనగోపాలస్వామి దేవాలయ ఆవరణలో కార్తీక దీపాలను వెలిగించారు. పేరాల శివాలయంలోని రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా చీరాల రూరల్ మండలం వాడరేవులో భక్తులు సముద్ర స్నానాలను ఆచరించారు. వాడరేవులోని కోదండ రామాలయానికి భక్తులు పోటెత్తారు.



అద్దంకిలోని పాత శివాలయంలో జ్వాలా తోరణం వెలిగిస్తున్న అర్చకులు



వేటపాలెం తీరం వద్ద పోలీస్ బందోబస్తుతో ఎస్సై వెంకటేశ్వర్లు



మణికేశ్వరంలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు



తీరం ఒడ్డున పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య దంపతులు



చినగంజాం సముద్ర తీరంలో స్నానమాచరిస్తున్న భక్తులు

నీట మునిగిన మొక్కజొన్న పరిశీలన



మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఏవో సుమతి

చీరాల రూరల్: గత రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు నష్టపోయిన పంట పొలాలను మండల వ్యవసాయాధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి సుమతి తమ సిబ్బందితో మండలంలోని బుర్లవారిపాలెం, పిట్టువారిపాలెం, గవినివారిపాలెం గ్రామాలలోని పొలాలను క్షేత్రస్థాయిలో సందర్శించి రైతులకు జరిగిన పంట నష్ట అంచనాలు వేశారు. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు 87.8 మి.మీ వర్షపాతం నమోదైందని తెలిపారు. వరిపంట సాగుచేసిన రైతులకు ఎటువంటి నష్టం జరగలేదని చెప్పారు. మొక్కజొన్న పంట నాటి పది నుంచి ఇరవై రోజులు మాత్రమే అయినందున జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అన్ని గ్రామాలలో కలుపుకుని 1,000 ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతుందని చెప్పారు. అందులో 50 ఎకరాలు మాత్రం పదిరోజులు నాటిన దశలో ఉన్నదని మళ్లీ వాటిని నాటుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు రమేష్, శ్రావ్య, ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.

వృద్ధ దంపతులకు ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

మార్టూరు: వృద్ధాప్యంలో కదలలేని స్థితిలో ఉన్న వృద్ధ దంపతులకు మార్టూరుకు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆర్థిక సహాయంతో పాటు నిత్యావసరాలు అందజేశారు. మండలంలోని చిమ్మిరిబండ గ్రామానికి చెందిన 80 సంవత్సరాల షేక్ పెంటూ మస్తాన్ ఇంకా రాళ్లు కొట్టి భార్య మస్తాన్ బీని పోషించుకున్నాడు. గత కొంతకాలంగా పెరాలసిస్ వ్యాధి సోకి మస్తాన్ మంచానికి పరిమితమై జీవనం దుర్భరమైంది. విషయం తెలుసుకున్న స్థానిక హెల్పింగ్ హాండ్స్ సంస్థ ప్రతినిధులు వారి నివాసానికి శుక్రవారం వెళ్లి వృద్ధ దంపతులకు రూ.5 వేల నగదు, సంస్థ సభ్యుడు షేక్ కాలేషా తన కుమారుడి పుట్టినరోజును పురస్కరించుకుని నిత్యావసరాలు అందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు పఠాన్ ఖాదర్ వలీ, సభ్యులు కే హరిబాబు, ఖాదర్‌బాషా, సాధిక్ బాషా, పాలు, కోటేశ్వరరావు, బెన్ని బాబు, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.